సాక్షి
నిజామాబాద్

బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025



వేసవిలో తాగునీటికి..
తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి శరత్ సూచించారు.
- 8లో ▸



టార్గెట్ ట్రాన్స్‌ఫార్మర్లే..
రెండేళ్ల కాలంలో జిల్లాలో 150 వరకు ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసి రాగి తీగ, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /13.4

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

డీసీసీబీని అగ్రస్థానంలో నిలపాలి



సుభాష్‌నగర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఎన్‌డీసీసీబీ) ద్వారా రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు అందించి రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలపాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. డీసీసీబీ పాలకవర్గం, సహకార సంఘాల కాల పరిమితిని ఆరు నెలలు పొడిగించినందుకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. రైతుల సంక్షేమానికి కృషి చేయడంతోపాటు అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం బాధ్యతతో పని చేయాలని సీఎం సూచించారని రమేశ్‌రెడ్డి తెలిపారు.

డైరెక్ట్ పర్చేస్ సెంటర్‌ను ప్రారంభించాలి



సుభాష్‌నగర్: పసుపు వ్యాపారుల సిండికేట్ దోపిడీని అరికట్టడంతోపాటు డైరెక్ట్ పర్చేస్ సెంటర్‌ను వెంటనే ప్రారంభించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి ప్రభాకర్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో వ్యాపారుల సిండికేట్ దోపిడీకి నిరసనగా ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అంతకు ముందు రైతులతో కలిసి మార్కెట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ఇతర మార్కెట్లలో పసుపు క్వింటాల్‌కు రూ.15 వేల ధర పలుకుతుండగా, నిజామాబాద్‌లో మాత్రం రూ.10 వేలలోపే ఉందని ఆరోపించారు. సిండికేట్‌గా మారిన వ్యాపారులపై ఇప్పటికైనా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ధర్నా వద్దకు సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ అపర్ణ వచ్చి అతి త్వరలోనే డీపీసీని ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

బ్లడ్ సర్వే నిర్వహించాలి



ఆర్మూర్‌టౌన్: ఫైలేరియా నివారణకు బ్లడ్ సర్వే(రక్తనమూనాల సేకరణ) చేపట్టాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ వైద్య సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో మంగళవారం డివిజన్ స్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సూపర్ వైజర్లతో డీఎంఅండ్‌హెచ్‌వో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాత్రి 8 నుంచి 12 గంటల వరకు సర్వే చేపట్టాలన్నారు. అలాగే మార్చి 13న ప్రైవేట్ ఆస్పత్రుల్లో, 18న మైగ్రేటెడ్ సర్వే, 23న మాస్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. డీఎంవో తుకారాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు పరిశీలన



నిజామాబాద్ సిటీ : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డంపింగ్‌యార్డును రీజినల్ డైరెక్టర్ సయ్యద్ మసూద్ మంగళవారం పరిశీలించారు. నగర శివారులోని నాగారంలో ఏర్పాటు చేసిన బయోమైనింగ్ ప్రాసెసింగ్‌ను, ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను వేరుచేసే ప్రక్రియను చూశారు. ప్లాస్టిక్ ఏరివేయడం, తడి చెత్త నుంచి ఎరువుల తయారీ, చెత్త రీసైకిల్ విధానాన్ని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయనవెంట నగర డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, డంపింగ్‌యార్డు ఇన్‌స్పెక్టర్ ప్రభురాజ్ తదితరులు ఉన్నారు.



సేంద్రియ సాగుతోనే పసుపు నాణ్యత

- నిజామాబాద్ పసుపునకు అంతర్జాతీయ మార్కెట్‌లో అడ్డంకిగా పురుగుమందు అవశేషాలు
- అవశేషాల స్థాయి తగ్గించాలంటున్న యూరోపియన్ మార్కెట్లు
- రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని శాస్త్రవేత్తల సూచన
- సేంద్రియంతోనే కర్కుమిన్ శాతం పెరుగుదల
- దీంతో పసుపు బోర్డు ద్వారా రైతులకు అనుకున్న స్థాయిలో మేలు

పసుపు సాగులో నిజామాబాద్ జిల్లా ప్రసిద్ధి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇక్కడి పసుపునకు మంచి డిమాండ్ ఉండేది. కాలక్రమేణా పసుపు సాగులో ఎరువులు, పురుగు మందుల వాడకం పెరగటంతో ప్రస్తుతం డిమాండ్ తగ్గింది. అంతర్జాతీయ స్థాయి మార్కెట్‌లో ఇందూరు 'పసుపు' మళ్లీ అగ్రస్థానంలో నిలవాలంటే సేంద్రియ విధానంవైపు రైతులు మొగ్గు చూపాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పసుపు రైతుల చిరకాల వాంఛ నెరవేరింది. ఇందూరులో పసుపు బోర్డు ఏర్పాటవుతున్న నేపథ్యంలో పసుపు సాగు విస్తీర్ణం సైతం మరింతగా పెరగనుంది. బోర్డు ఏర్పాటు రైతులకు మేలు కలిగే విషయమే, కానీ అనుకున్న విధంగా లక్ష్యం నెరవేరాలంటే 'కర్కుమిన్' శాతం అధికంగా వచ్చే నాణ్యమైన పసుపు పండించాల్సిన ఆవశ్యకత నెలకొంది. రైతులు ఈ దిశగా ఆలోచన చేసి పసుపు సాగులో సేంద్రియ సాగు పద్ధతులు అవలంబించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. రసాయన ఎరువులు, పురుగుమందుల కారణంగానే కర్కుమిన్ శాతం తగ్గుతోందని చెబుతున్నారు. కాగా, రైతులు మాత్రం పసుపు సాగుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సాహకాలందించాలని, అవసరమైతే సేంద్రియ ఎరువులు సరఫరా చేయాలని కోరుతున్నారు.

ఎగుమతులపై ప్రభావం..

ఏడాది క్రితం హైదరాబాద్‌లో ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జరిగిన ఎగుమతిదారుల సమావేశంలో ఎంఎస్‌ఎంఈ (మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) సంస్థ అధికారులు పలు విషయాలు వెల్లడించారు. పంట ఉత్పత్తులను అంతర్జాతీయ పోటీలో నిలబెట్టేందుకు అదనపు విలువ సైతం స్థానికంగానే జోడించాల్సి ఉందన్నారు. ఎగుమతిదారులు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో ముఖ్యంగా పసుపు పంటలో పురుగుమందు అవశేషాలు అనుమతించిన స్థాయి కంటే ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో యూరోపియన్ మార్కెట్‌లో తిరస్కరణకు గురవుతోందన్నారు. యూరప్‌లో పసుపు పంట ఉత్పత్తిలో పురుగుమందు (క్లోరిపైరిఫాస్)కు సంబంధించి ఎంఆర్‌ఎల్ (గరిష్ఠ అవశేష స్థాయి) 0.05 పీపీఎం నుంచి 0.01 పీపీఎంకు తగ్గించారన్నారు. ఇది సేంద్రియ సాగుకు సమానమన్నారు. ఇక్కడ పండించే పసుపులో పురుగుమందు అవశేషాలు ఎక్కువగా ఉంటుండడంతో ఎగుమతులపై ప్రభావం పడుతోందన్నారు. తేమ శాతం కూడా ఎక్కువగా ఉంటే రీప్రాసెసింగ్ చేయాల్సి వస్తోందన్నారు. దీంతో ఎగుమతులు కష్టతరంగా మారుతున్నాయని తెలిపారు. సేంద్రియ సాగుకు ప్రాధాన్యమిస్తే ఎగుమతులు పెంచొచ్చని, ఎఫ్‌పీవోల ద్వారా గ్రేడింగ్ చేసి ఇక్కడే అదనపు విలువ జోడించి నేరుగా ఎగుమతులు చేయవచ్చని స్పష్టం చేశారు.

పసుపు బోర్డుతో పెరిగిన సాగు

పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటనతో ఏటా తగ్గుతూ వస్తున్న పసుపు సాగు ఈ ఏడాది మళ్లీ పెరిగింది. గత సీజన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా నిజామాబాద్ మార్కెట్‌లో అత్యధికంగా పసుపు క్వింటా ధర రూ.22వేలు పలికింది. సగటున రైతులకు క్వింటాకు రూ.16వేల నుంచి రూ.18వేల వరకు ధర దక్కింది. దీంతో తగ్గుతూ వచ్చిన పసుపు పంట సాగు ఈసారి పెరిగింది. ఇక రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు ప్రతి ఏటా సుమారు 10 లక్షల క్వింటాళ్ల పసుపు వస్తోంది. ఇక్కడి మార్కెట్‌లో 2010–11లో పసుపు క్వింటా ధర రూ.16వేలు పలికింది. ఆ తర్వాత భారీగా తగ్గుతూ వచ్చింది. క్వింటా రూ.10వేల నుంచి కనిష్ఠంగా రూ.3వేల కిందకు పడిపోయింది. సాగు విస్తీర్ణం తగ్గడంతో సహజంగానే మళ్లీ ధర పెరిగింది. 2021–22లో క్వింటా రూ.8వేలు ధర పలుకగా, గత సీజన్‌లో(2022–23) ఏకంగా క్వింటా రూ.22వేలు పలకడం గమనార్హం. కాగా, పసుపు బోర్డు ఏర్పాటు నేపథ్యంలో ఇకపై సాగు విస్తీర్ణం మరింతగా పెరగనుంది. దీంతో రైతులకు ఆశించిన మేర లాభాలు రావాలంటే ఎగుమతులు పెరగాలి. ఎగుమతులు పెరగాలంటే పురుగుమందుల అవశేషాల స్థాయి అంతర్జాతీయ ప్రమాణాల మేరకు మాత్రమే ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉంది. ఇక పశువుల పేడతో భూసారం సైతం పెరగనున్నందున సేంద్రియ సాగు విధానాలు పాటించాల్సిన ఆవశ్యకత నెలకొంది.

ఇందూరులోనే 40 శాతం సాగు

పసుపు సాగు అనగానే రాష్ట్రంలో మొదటగా గుర్తొచ్చేది నిజామాబాద్ ప్రాంతమే. అత్యధికంగా 40 శాతం నిజామాబాద్ జిల్లాలో పసుపు సాగవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.5 లక్షల ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నారు. అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 35 వేల ఎకరాలు, జగిత్యాల 25వేలు, నిర్మల్ 20 వేలు, వరంగల్ 6 వేలు, వికారాబాద్ 3,500, మహబూబాబాద్ 4,500 , హన్మకొండ 2,800, భూపాలపల్లి 1,200 ఎకరాల్లో పండిస్తున్నారు. ఇక ఆదిలాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో మోస్తరుగా, ఇతర జిల్లాల్లో స్వల్పంగా సాగవుతోంది. ఎకరానికి 120 నుంచి 140 క్వింటాళ్ల పచ్చి పసుపు దిగుబడి వస్తుండగా, ఉడకబెట్టి పాలిష్ చేశాక 22 నుంచి 25 క్వింటాళ్లు అవుతోంది. రాష్ట్రంలో పండించే పసుపులో 3 శాతం వరకు 'కర్కుమిన్' వస్తోంది.

రాష్ట్రంలో నాలుగేళ్లలో పసుపు సాగు వివరాలు

సంవత్సరం	సాగుచేసిన ఎకరాలు
2021-22	1,05,000
2022-23	68,000
2023-24	43,159
2024-25	60,000

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

నాణ్యమైన పసుపు దిగుబడి లభించాలంటే రైతులు సేంద్రియ సాగును అవలంబించాల్సి ఉంది. రైతులు రసాయనాల శాతం సాధ్యమైనంత తగ్గించాలని, సేంద్రియ ఎరువులను వినియోగించాలనే విషయమై అవగాహన కల్పిస్తున్నాం. పసుపు సాగు చేసే పొలాల్లో మొదటగా పశువుల పేడ పోయిస్తున్నాం. సాగు సమయంలో క్రిమిసంహారక మందులు, ఎరువులు వినియోగించడం కారణంగా 'కర్కుమిన్' శాతం తగ్గిపోతోంది. కర్కుమిన్ శాతం ఎక్కువ వచ్చేలా చేసేందుకు రైతులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. – మహేందర్, శాస్త్రవేత్త, పసుపు పరిశోధన కేంద్రం, కమ్మర్‌పల్లి

వ్యాపారుల మోసాలను అరికట్టండి

నిజామాబాద్‌అర్బన్: మార్కెట్ యార్డులో వ్యాపారుల మోసాలను అరికట్టాలని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు మంగళవారం విన్నవించారు. పంట చేతికి రాకముందు నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో రూ.13,500 నుంచి రూ.15,000 వరకు ఉన్న ధరను రైతులు మార్కెట్‌లోకి పసుపు తీసుకురావడం ప్రారంభించగానే రూ.10వేల లోపు ధర నిర్ణయం చేస్తున్నారన్నారు. ఈ ఏడాది పసుపు సాగు విస్తీర్ణంతోపాటు దిగుబడి కూడా తగ్గిందని, మార్కెట్‌లో సిండికేట్ కుట్రలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. అలాగే మరో వాణిజ్య పంట అయిన ఎర్రజొన్న చేతికి రాకముందు ధర రూ.4,500 ఉంటే పంట చేతికొచ్చాక రూ.3,700 తగ్గించారన్నారు. ఎర్రజొన్న రైతులు సైతం సిండికేట్‌గా మారి రైతులను ముంచే ప్రయత్నం చేస్తున్నారని, వారి మోసాలను అడ్డుకుని రైతులు మోసపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలీసులకు డ్రైవింగ్ రావాలి

- ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ

ఖలీల్‌వాడి: అత్యవసర పరిస్థితుల్లో పోలీసులకు డ్రైవింగ్ ఎంతో ప్రధానమని ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు కొత్తగా 218 సివిల్, 127 ఏఆర్, మొత్తం 345 మంది పోలీసు కానిస్టేబుళ్లు వచ్చారని, వారికి వాహనాల డ్రైవింగ్ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చాలామంది డ్రైవింగ్ సరిగా రాక రోడ్డు ప్రమాదాల బారినపడుతున్నారన్నారు. ఇప్పటికే నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 60 మంది కానిస్టేబుళ్లకు శిక్షణ ఇచ్చామని, మిగతా వారికి కూడా డ్రైవింగ్‌పై పూర్తి పట్టువచ్చేలా శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు.

మహిళా కానిస్టేబుళ్లతో క్విక్ రియాక్షన్ టీం

జిల్లాలోని మహిళా కానిస్టేబుళ్లతో ప్రత్యేకంగా రెండు క్విక్ రియాక్షన్ టీంలను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ తెలిపారు. ఎక్కడైనా శాంతి భద్రతల సమస్య తలెత్తినప్పుడు వెంటనే అక్కడికి చేరుకొని మహిళలను అదుపు చేయటంతోపాటు శాంతి భద్రతలను కాపాడటంలో సహకరిస్తారని పేర్కొన్నారు. వాహనాల తనిఖీ, రైల్వే, బస్ స్టేషన్లతోపాటు రద్దీ ప్రదేశాల్లో తనిఖీలు చేస్తారని తెలిపారు.




డ్రైవింగ్ చేస్తున్న మహిళ కానిస్టేబుల్

నరహంతకుడు, తల్లికీ జీవితఖైదు

స్నేహితుడి ఆస్తిపై కన్నేసి, అతని కుటుంబాన్ని దారుణంగా హతమార్చిన కేసులో మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన ప్రశాంత్ నిందితుడు. ఒకరికి తెలియకుండా మరొకరిని వివిధ ప్రాంతాల్లో హత్యచేసినట్లు అభియోగాలు ఉన్నాయి. 2023 సంవత్సరంలో స్నేహితుడు ప్రసాద్‌ను, అతని భార్య, ఇద్దరు చెల్లెళ్లు, ఇద్దరు కవల పిల్లలను హత్య చేసినట్లు నిందితుడిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ వరుస హత్యలు రాష్ట్రంలోనే సంచలనం సృష్టించాయి. కవల పిల్లల హత్య కేసులను విచారించిన జిల్లా కోర్టు ప్రధాన నిందితుడు ప్రశాంత్‌కు, హత్యలకు సహకరించిన అతని తల్లి ఒడ్డెమ్మకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పింది.

- కవల పిల్లల హత్య కేసుల్లో నిజామాబాద్ జిల్లా కోర్టు తీర్పు
- స్నేహితుడి కుటుంబాన్నే హతమార్చిన వైనం..
- మొత్తం ఆరుగురి హత్య.. కొనసాగుతున్న మిగతా కేసుల విచారణ





జీవిత ఖైదు పడిన ప్రశాంత్

ఖలీల్‌వాడి: ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి హత్య కేసులలోని రెండు కేసుల్లో ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాల మంగళవారం తీర్పు చెప్పారు. జిల్లా కోర్టులోని తన చాంబర్‌లో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి రాజేశ్వర్‌రెడ్డి మీడియాకు తెలిపిన తీర్పు వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని మాక్లూర్ మండలానికి చెందిన పూన ప్రసాద్, అతని భార్య రమణి, ఇద్దరు చెల్లెళ్లు శ్రావణి, స్వప్న, కవల పిల్లలు అయిన కూతురు పూన చైత్రిక, బాబు చైత్రిక్‌లను ఆస్తికోసం ఒకరికి తెలియకుండా ఒకరిని నిందితుడు మేడిద ప్రశాంత్, అతని తల్లి ఒడ్డెమ్మ, తమ్ముడితోపాటు ఇద్దరు స్నేహితుల సహకారంతో చంపాడు. నిందితుడు అద్దెకు తెచ్చుకున్న కారులో శవాలను వివిధ ప్రదేశాలలో పడేశాడు. 2023 డిసెంబర్ 30న మెండోరా మండలంలోని దూదిగాం గ్రామ శివారులోని గోదావరి నది సోన్ బ్రిడ్జి వద్ద కవల పిల్లలు చైత్రిక, చైత్రిక్ శవాలను వేరువేరు ప్లాస్టిక్ సంచిలలో మూటకట్టి పడేశారు. కవలల హత్యపై మెండోరా పీఎస్‌లో రెండు కేసులు నమోదు అయ్యాయి. ఈ రెండు కేసులలో కోర్టులో విచారణ అనంతరం జిల్లా జడ్జి సునీత కుంచాల నిందితులు అయిన మాక్లూర్ గ్రామానికి చెందిన మేడిద ప్రశాంత్, అతని తల్లి మేడిద ఒడ్డెమ్మలకు జీవిత ఖైదు విధించారు. మెండోరా పోలీసులు చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత 28 మంది సాక్ష్యాలను పరిశీలించిన అనంతరం ఇద్దరికి జీవితఖైదుతోపాటు రూ.2 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని యెడల ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాలని జిల్లా జడ్జి తీర్పులో పేర్కొన్నారు. దీంతోపాటు సాక్ష్యాలు తారుమారు చేసినందుకు ఏడు సంవత్సరాల తోపాటు రూ.1000 జరిమానా చెల్లించాలని లేకుంటే మరో మూడు నెలల జైలు శిక్ష , ఆలాగే ఆస్తి కాజేసేందుకు ప్రయత్నించినందుకు మరో ఏడు ఏళ్లు శిక్షతోపాటు రూ.1000 చెల్లించాలని లేకుంటే మరో మూడు నెలలపాటు శిక్ష అనుభవించాలని తీర్పు ఖరారు చేశారు. ఈ శిక్షలను ఏక కాలంలో అనుభవించాలని స్పష్టం చేశారు. మృతుల పక్షాన పీపీ రాజేశ్వర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇంకా నాలుగు కేసుల్లో విచారణ కొనసాగుతోంది. ప్రసాద్‌ను హత్య చేసి మాక్లూర్ మండలంలోని ముదక్‌పల్లిలోని అటవీ ప్రాంతంలో పూడ్చివేశారు. ప్రసాద్ పెద్ద చెల్లెలు శ్రావణి హత్య కేసు మేడ్చల్ జిల్లాలో, చిన్న చెల్లెలు స్వప్న కేసు కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో, ప్రసాద్ భార్య రమణి హత్య కేసు నిజామాబాద్ జిల్లాలోని నవీపేట్ పోలీస్‌స్టేషన్‌లో కొనసాగుతున్నాయి. త్వరలో వీటిపై కూడా తీర్పు వస్తుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పేర్కొన్నారు.

తాగు నీరు, విద్యుత్ సరఫరాను పర్యవేక్షించాలి

- వీసీలో కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశం
- తాగునీటి సమస్య పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఇతర అధికారులు

నిజామాబాద్‌అర్బన్: తాగు సాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే, సత్వరమే పరిష్కరించాలని సూచించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ తాగునీటి సరఫరా సంబంధిత సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు తాగునీటి సమస్యపై టోల్ ఫ్రీ నెంబర్ 18005994007కు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకు మిషన్ భగీరథ జలాలను సరఫరా చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రబీ పంటలు చేతికందే వరకు సాగు నీటి వసతి కల్పించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. శ్రీరాంసాగర్ సాగర్ ప్రాజెక్టు ద్వారా ఆయా జిల్లాల్లోని నిర్దేశిత ఆయకట్టుకు ఇప్పటివరకు ఎన్ని తడుల నీటిని అందించారు, ఇంకా ఎన్ని తడులు అందిస్తారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తుగానే ప్రణాళికలు రూపొందించుకొని అన్నిరంగాలకు కోతలు లేకుండా నాణ్యమైన కరెంటును సరఫరా చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులుంటే టోల్ ఫ్రీ నెంబర్ 1912కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ అయ్యేలా ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయించాలన్నారు. గురుకుల పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్
- ప్రభుత్వ భూముల పరిశీలన

నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. సమీకృత రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, వసతిగృహ సముదాయాల నిర్మాణాల కోసం అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించేందుకు కలెక్టర్ మంగళవారం నిజామాబాద్ నగర శివారులోని నాగారం, గుండారం ప్రాంతాలను సందర్శించారు. గుండారం గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో పలు ఆక్రమణలను కలెక్టర్ గమనించారు. వెంటనే వాటిని తొలగించాలని, ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆయా ప్రదేశాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి అనువైన పరిస్థితులు, వాతావరణ అంశాలను పరిశీలించారు. సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని అధికారులతో పేర్కొన్నారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, తహసీల్దార్ బాలరాజు, అధికారులు ఉన్నారు.



నాగారంలో ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ట్రాన్స్‌ఫార్మర్లే టార్గెట్

- పగటివేళ దుండగుల రెక్కీ.. రాత్రిపూట ధ్వంసం
- సులభంగా కాపర్‌వైర్, కాయిల్స్ చోరీ
- జిల్లా వ్యాప్తంగా వరుస దొంగతనాలు
- రెండేళ్లలో 150.. ఈ ఏడాది 31
- ట్రాన్స్‌కో, పోలీసులకు కునుకు లేకుండా చేస్తున్న వైనం



నందిపేట మండలంలో దొంగతనానికి గురైన ట్రాన్స్‌ఫార్మర్



దొంగతనానికి గురైన నందిపేట మండలం తల్వేద ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్

నందిపేట్(ఆర్మూర్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు.. వీటిని ముట్టాలంటేనే సామాన్య ప్రజలు భయపడతారు. సరైన జాగ్రత్తలు పాటించకుండా విద్యుత్ శాఖ సిబ్బంది సైతం మరమ్మతులు చేయరు. అలాంటి వాటినే టార్గెట్ చేసుకుందీ ఈ దొంగల ముఠా. సులభంగా ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తూ రాగి తీగలు, కాయిల్స్‌ను చోరీ చేస్తూ విద్యుత్ శాఖతోపాటు పోలీసులకు సవాలు విసురుతున్నారు.

రెండు నెలల్లో 31 ట్రాన్స్‌ఫార్మర్లు..

గత రెండు సంవత్సరాల్లో జిల్లాలో సుమారు 150 వరకు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి తీగలను ఎత్తుకెళ్లారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 31 ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసంతో విద్యుత్ కార్పొరేషన్‌కు రూ.15వేల మేర నష్టం వాటిల్లుతుండగా, కాపర్ తీగలను మళ్లీ ట్రాన్స్‌ఫార్మర్‌లో బిగించాలంటే సుమారు రూ.30వేల వరకు భారం పడుతోంది. గతేడాది జరిగిన దొంగతనాలతో విద్యుత్ కార్పొరేషన్‌కు రూ.25 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.

సులభంగా ఉండటంతోనే..

ఈ దొంగల ముఠా ఎక్కువగా రహదారి పక్కన, రోడ్డు సౌకర్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లనే ఎంచుకుంటుంది. ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్లను సైతం ధ్వంసం చేసి సులువుగా రాగితీగలను దొంగిలిస్తున్నారు. చిన్న ట్రాన్స్‌ఫార్మర్లలో 8 నుంచి 10 కిలోల రాగితీగ ఉంటే, పెద్ద ట్రాన్స్‌ఫార్మర్లలో 15 నుంచి 20 కిలోల వరకు ఉంటాయి. బయట మార్కెట్‌లో రాగి తీగ కిలో రూ.400 నుంచి రూ.500 వరకు ధర పలుకుతోంది. దీంతో కష్టపడకుండానే ఎక్కువ డబ్బులు వస్తాయన్న దురాశతో ముఠా ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్‌గా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ మూతను నట్ బోల్టులకు బదులుగా వెల్డింగ్ చేస్తే దొంగల ముఠాకు కష్టంగా మారుతుందని, దీంతో కొంతవరకైనా దొంగతనాల నివారణకు అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌కు యాంటీ థెఫ్ట్ నట్ బోల్టులు బిగిస్తున్నాం. మరమ్మతుకు వచ్చే ట్రాన్స్‌ఫార్మర్ మూతల చుట్టూ వెల్డింగ్ చేసేలా చర్యలు తీసుకుంటాం. దొంగతనాలపై పోలీసు కేసు నమోదు చేయడంతోపాటు వారి సహకారంతో దర్యాప్తు చేస్తున్నాం. దొంగతనాల నివారణకు రైతులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సహకరించాలి.

– రవీందర్, ఎస్ఈ, ట్రాన్స్‌కో

క్లుప్తంగా

విద్యార్థులకు ఉపయోగపడే రచనలు రావాలి



తెయూ(డిచ్‌పల్లి): వ్యాయామ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపయోగపడే రచనలు మరిన్ని రావాలని తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు అన్నారు. తెయూ క్రీడా విభాగంలోని కాంట్రాక్టు ఫిజికల్ డైరెక్టర్ బీఆర్ నేత రచించిన 'ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు చేయాల్సిన శాస్త్రీయ సాధన' అనే పుస్తకాన్ని రచించారు. ఈసందర్భంగా పుస్తకాన్ని మంగళవారం వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి ఆవిష్కరించారు. ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్ పాల్గొన్నారు.

నేడు జిల్లాకు రైల్వే జీఎం అర్వింద్‌కుమార్‌జైన్ రాక

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌ను పరిశీలించడానికి బుధవారం రైల్వే జీఎం అర్వింద్‌కుమార్‌జైన్ వస్తున్నట్లు రైల్వే అధికార వర్గాల ద్వారా తెలిసింది. వార్షిక ప్రణాళికలలో భాగంగా రైల్వేస్టేషన్‌లో రక్షణ చర్యలు, అధికారులతో సమావేశం, రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలన చేస్తారని తెలుస్తోంది.

వేసవిలో తాగునీటికి ముందస్తు చర్యలు చేపట్టాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఏ శరత్
- నిజామాబాద్ జిల్లా అధికారులతో సమీక్ష



అధికారులతో సమావేశమైన ప్రత్యేకాధికారి శరత్, కలెక్టర్ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి ఏ శరత్ సూచించారు. జిల్లాలోని ఏ ప్రాంతంలో కూడా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా అంకితభావంతో పని చేయాలని, నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో మంచి నీటి సరఫరా పరిస్థితిపై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గతేడాది జిల్లాలో ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించారని అధికారులను అభినందించారు. ఈ ఏడాది సైతం వేసవి సీజన్ ముగిసే వరకు అదే స్ఫూర్తితో పని చేయాలన్నారు. తాగునీటి సరఫరాను మెరుగుపర్చేందుకు చేపడుతున్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, మెకానిక్‌లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రత్యేకాధికారులు క్రమం తప్పకుండా మండలాల్లో పర్యటిస్తూ పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ పట్టణాలతోపాటు ఆయా మండలాలకు తాగునీటిని అందించే జలాశయాల్లో సరిపడా నీటి నిల్వలు ఉన్నట్లు తెలిపారు. వేసవిలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే, తక్షణమే స్పందించి చర్యలు చేపట్టేవిధంగా అధికారులను, క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తంగా ఉంచుతామని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

దేశ ఔన్నత్యాన్ని చాటేందుకే స్కేటింగ్ యాత్ర



సోనీని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

రుద్రూర్: భారతదేశ ఔన్నత్యాన్ని చాటేందుకు, ప్రతి పౌరుడిలో దేశభక్తి ప్రేరేపించడానికే స్కేటింగ్ యాత్ర చేపట్టినట్లు కాశీకి చెందిన సోనీ చౌరసియా అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని పుణ్యక్షేత్రమైన కాశీ (వారణాసి) నుంచి సోనీ చౌరసియా అనే యువతి స్కేటింగ్ చేస్తూ మంగళవారం పోతంగల్ మండల కేంద్రానికి చేరుకుంది. ఈసందర్భంగా పోతంగల్, కోటగిరి, రుద్రూర్ మండల కేంద్రాల్లో ఆమెకు స్థానిక బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. రుద్రూర్ పార్టీ కార్యాలయంలో సోనీ చౌరసియాతోపాటు ఆమె గురువులను సత్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్య భారత్ రోలర్ స్కేటింగ్ టూర్‌ను జనవరి 20న కాశీలో ప్రారంభించినట్లు తెలిపారు. 10,550 కిలోమీటర్లు స్కేటింగ్ యాత్ర ద్వారా భారతదేశ గొప్పతనాన్ని చాటిచెప్పడమే లక్ష్యమని వివరించారు. కామారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు నీలం చిన్న రాజు, మండల అధ్యక్షుడు హరికృష్ణ, ప్రశాంత్‌గౌడ్, రాంరాజు, పార్వతి మురళి, సాయినాథ్, గణేష్, వినోద్, అనిల్ పాల్గొన్నారు.

పాత కక్షలతో ఒకరి హత్య!



లింగంపేట(ఎల్లారెడ్డి): పాత కక్షలతో ఒకరిని హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పిట్లం మండలం బొల్లక్‌పల్లి, లింగంపేట మండలం బాణాపూర్ గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. పిట్లం మండలం బొల్లక్‌పల్లి గ్రామానికి చెందిన ఉప్పరి పోచయ్య(70) ఈనెల 1న తన ఇంటి ఆరుబయట నిద్రించాడు. మరుసటి రోజు నుంచి అతడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా బొల్లక్‌పల్లి గ్రామానికి చెందిన అనుమానితుడిని విచారించారు. అనుమానితుడికి, మృతుడికి మధ్య భూ వివాదంతోపాటు పలు విషయాలపై పాత కక్షలు ఉండగా, తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిసింది. దీంతో హత్య చేసిన ప్రదేశమైన లింగంపేట మండలం బాణాపూర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలోకి పోలీసులు అనుమానితుడిని తీసుకెళ్లి ఆధారాలు సేకరించారు. పోచయ్యను ఒక్కడే హత్య చేశాడా..? మరెవరైనా సహకరించారా..? అనే కోణంలో విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ విషయమై పిట్లం ఎస్సై రాజును వివరణ కోరగా విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



కొత్తపల్లి అఖిల్ (ఫైల్)



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు

భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి గ్రామ శివారులో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలు ఇలా.. భిక్కనూరులో హేయిర్ కటింగ్ షాపు నిర్వహిస్తున్న కొత్తపల్లి అఖిల్ (30) మంగళవారం వేములవాడకు స్నేహితులతో కలిసి వెళ్తున్నా అని ఇంట్లో వారికి చెప్పి, బైక్‌పై బయలుదేరి వెళ్లాడు. అంతంపల్లి–బీటీఎస్ మధ్యలో జాతీయ రహదారిపై రాత్రివేళ అఖిల్ అపస్మారక స్థితిలో కనిపించాడు. స్థానికులు గమనించి నేషనల్ హైవే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది వెంటనే అక్కడికి అఖిల్‌ను కామారెడ్డికి ఆస్పత్రికి తరలించారు. కానీ వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించాడని నిర్ధారించారు. మృతుడికి భార్య సింధు, రెండేళ్ల కూతురు, తల్లిదండ్రులు ఉన్నారు. అఖిల్ బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి మరణించాడా? లేక ఇంకా ఏదైనా కారణం ఉందా అన్న విషయాలు తెలియరాలేదు.

క్రైం కార్నర్

రెండు బైకులు ఢీ: ఇద్దరికి గాయాలు

ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామ శివారులోగల 44వ నంబరు జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఓ బైక్ ముందున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు, అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా.. చంద్రాయన్‌పల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్న అశోక్ కామారెడ్డి నుంచి బైక్‌పై వస్తున్నాడు. కామారెడ్డికి చెందిన భరత్ అదేమార్గంలో కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి అతడిని ఢీకొన్నాడు. ఈప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఇరువురిని టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

ఖలీల్‌వాడి: రెంజల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాడ్‌బిలోలి గ్రామశివారులోగల పేకాట స్థావరంపై దాడి చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య, స్పెషల్ పార్టీ సిబ్బంది మంగళవారం తెలిపారు. పేకాడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే వారి వద్ద నుంచి ఐదు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ. 31,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. తదుపరి చర్య నిమిత్తం రెంజల్ ఎస్సై సాయన్నకు అప్పగించినట్లు తెలిపారు.

అటవీ భూమిని చదును చేసిన ట్రాక్టర్లు స్వాధీనం



సిరికొండ: మండలంలోని తాటిపల్లి గ్రామ సమీపంలోగల అటవీభూమిని చదును చేసిన రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్వో రవీందర్ మంగళవారం తెలిపారు. ట్రాక్టర్లను స్వాధీనపర్చుకునే సమయంలో అటవీశాఖ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన మాలావత్ మదన్‌లాల్, సావిత్రి, నందిలాల్, మాలావత్ భూపతి అనే వ్యక్తులపై సిరికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామన్నారు.

న్యాల్‌కల్‌లో ఒకరిపై దాడి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని న్యాల్‌కల్ గ్రామంలో సోమారపు గంగాధర్‌పై అదే గ్రామానికి చెందిన ముగ్గురు దాడి చేసి గాయపర్చిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన గంగాధర్‌కు రమణ రావు, లక్ష్మణ్, మరో వ్యక్తి ఆదివారం ఫోన్ చేసి పేకాట ఆడుదామని పిలిపించారు. అక్కడికి వెళ్లిన గంగాధర్ తాను పేకాట ఆడబోనని చెప్పడంతో తాగిన మైకంలో ముగ్గురు కలిసి దాడికి పాల్పడ్డారు. గంగాధర్‌కు తీవ్ర గాయాలు కావడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ చోరీ కేసులో నిందితుల అరెస్టు



భిక్కనూరు: బైక్ చోరీ నిందితులిద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు మంగళవారం తెలిపారు. భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కామారెడ్డిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన సోదరులు షేక్ తోఫిక్, షేక్ అఫ్రోజ్‌లను అనుమానంతో పట్టుకుని విచారించారు. దీంతో వారు జంగంపల్లి గ్రామంలో, భిక్కనూరులో బైక్‌లను చోరీ చేసినట్లు అంగీకరించారు. అనంతరం వారి వద్ద నుంచి నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

ఐదుగురికి 14రోజుల రిమాండ్

ఖలీల్‌వాడి: పోలీసుల వాహనం అద్దాలు ధ్వంసం చేసిన కేసులో ఐదుగురు వ్యక్తులకు జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు మూడోటౌన్ ఎస్సై హరిబాబు మంగళవారం తెలిపారు. నగరంలోని శ్రద్ధానంజ్ గంజ్‌లో ఈనెల 15న సెక్యూరిటీ గార్డుపై కొందరు వ్యక్తులు దాడి చేస్తున్నారనే సమాచారం మేరకు పెట్రో కారులో పోలీసులు ఘటన స్థలానికి వెళ్లారు. ఈక్రమంలో కొంత మంది వ్యక్తులు పెట్రోకారు అద్దాలు పగలగొట్టారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, ఐదుగురు వ్యక్తులను కోర్టు ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

ఎస్సైని ఢీకొట్టిన కారు



ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సై–2 ఉదయ్‌కుమార్ మంగళవారం ఆర్‌ఆర్‌చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో ఓ కారును ఆపే సమయంలో ఎస్సైని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయనకు గాయాలు కాగా, వెంటనే సిబ్బంది, స్థానికులు ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. టౌన్ సీఐ శ్రీనివాస్‌రాజు, ఎస్సై శ్రీకాంత్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రస్తుతం ఎస్సై ఆరోగ్యం కుదుటపడిందని వైద్యులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బొలెరో వాహనం

- ప్రమాదంలో భార్య మృతి, భర్తకు గాయాలు



శకుంతల మృతదేహం

పిట్లం(జుక్కల్): కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రం శివారులోని జాతీయ రహదారిపై మంగళవారం సంగారెడ్డి జిల్లాకు చెందిన దంపతులిద్దరూ బైక్‌పై వెళుతుండగా బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలోని అంతర్గామ గ్రామానికి చెందిన శకుంతల, సంగయ్య దంపతులు బైక్‌పై చిన్నకొడప్‌గల్ వైపు బయలుదేరారు. పిట్లం శివారులో వారి బైక్‌ను బొలెరో వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈఘటనలో శకుంతల (45) మృతి చెందగా, సంగయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం బాన్సువాడ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు నమోదు చేశారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి



శ్రీనివాస్‌పై బోల్తాపడిన ట్రాక్టర్

బాల్కొండ: పంటభూమిని దుక్కి దున్నుటకు ఓ వ్యక్తి ట్రాక్టర్‌పై వెళుతుండగా ప్రమాదవశాత్తు వాహనం బోల్తాపడి మృతిచెందాడు. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాలు ఇలా.. కర్నేబోయిన శ్రీనివాస్(27) అనే వ్యక్తి బతుకు దెరువు కోసం మెదక్ నుంచి వెల్కటూర్‌కు కొన్నేళ్ల క్రితం వలస వచ్చాడు. గ్రామంలో ఇతరుల భూములను కౌలుపై సాగు చేసేవాడు. ఈక్రమంలో గ్రామానికి చెందిన గంగాధర్ ట్రాక్టర్‌ను మంగళవారం అతడు తీసుకుని తాను కౌలు చేస్తున్న పంట భూమిని దుక్కి దున్నుటకు బయలుదేరాడు. మార్గ మధ్యలో ట్రాక్టర్ బోల్తాపడటంతో శ్రీనివాస్ ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయి అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కాలువలో పడి ఒకరు..

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రధాన కాలువలో పడి ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. మహమ్మద్ నగర్ మండల కేంద్రానికి చెందిన జగ్గంపల్లి సాయిలు(55) అనే వ్యక్తి ఈ నెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. మంగళవారం సింగితం శివారులోని నిజాంసాగర్ ప్రధాన కాలువ అతడి మృతదేహం పోలీసులకు లభ్యమైంది. మృతుడి భార్య సాయవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బైక్‌ల చోరీ కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో బైక్‌లను చోరీ చేసిన కేసులో ఇద్దరు నిందితులకు ఏడాది సాధారణ జైలు శిక్ష పడినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. గత ఏడాది వరగంటి మోహన్, తెడ్డు నరేష్‌లు తమ ఇంటి ముందర నిలిపిన బైక్‌లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మోహన్ బైక్‌ను బోధన్‌కు చెందిన మాలవత్ తులసీరాం, నరేష్ బైక్‌ను బోధన్‌కు చెందిన అబ్దుల్ ఆయాజ్‌ఖాన్ చోరీ చేసినట్లు గుర్తించి, అరెస్టు చేశారు. వారిని ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చగా, విచారణ అనంతరం జడ్జి నిందితులిద్దరికి ఏడాది సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

మట్కా నిర్వాహకుడికి రెండు రోజులు..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఆచన్‌పల్లికి చెందిన షేక్ గఫార్ బోధన్‌లో మట్కా నిర్వహిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బోధన్ కోర్టులోని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట అతడిని హాజరుపరుచగా జడ్జి రెండు రోజుల జైలుశిక్షను విధించినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో..

ధర్పల్లి: ధర్పల్లి శివారులోని ఎల్లమ్మ టెంపుల్ వద్ద ఇటీవల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఇందిరానగర్ తండాకు చెందిన సీతారాం మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో సీతారాంను మంగళవారం నిజామాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా జడ్జి అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

నవీపేట మండలంలో..

నవీపేట: నవీపేట్ గ్రామానికి చెందిన మహమ్మద్‌నబీ సాబ్, అబ్బాపూర్ (బి) గ్రామానికి చెందిన బాబు, నిర్మల్ జిల్లా కుబీర్‌కు చెందిన ఇసాల రాకేష్ ఇటీవల మద్యం తాగి వాహనాలు నడుపుతూ నవీపేట పోలీసులకు పట్టుబడ్డారు. మంగళవారం వారిని నిజామాబాద్ కోర్టులో హాజరుపర్చగా స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ 2 రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య



శ్యామ్(ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా.. మహమ్మద్ నగర్‌కు చెందని తూర్పటి మోహన్(28) నిత్యం మద్యం తాగి వస్తుండటంతో భార్య కాశవ్వ మందలించేది. అలాగే తరుచూ దంపతుల మధ్య గొడవలు జరుగుతుండేవి. సోమవారం రాత్రి మద్యం తాగివచ్చిన మోహన్, భార్యతో గొడవపడి, అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మనస్తాపం చెంది గ్రామశివారులోని తన తల్లి సమాధి వద్ద ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఇందల్వాయి మండలంలో ఒకరు..

ఇందల్వాయి: మండలంలోని ఓ వ్యక్తి మానసికంగా సరిగా లేక ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన గాండ్ల శ్యామ్(24) గతంలో గల్ఫ్‌కి వెళ్లి వచ్చాడు. ప్రస్తుతం ఇంటివద్దనే వ్యవసాయ పనులతోపాటు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈమధ్య అతను మానసికంగా ఆరోగ్యంగా లేకపోవడంతోపాటు మంగళవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి ఇంకా పెళ్లి కాలేదని, మృతుడి తల్లి పోశవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు.

యువకుడి అదృశ్యం



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని వెల్గనూర్ గ్రామానికి చెందిన సురిసాని రాజశేఖర్‌రెడ్డి అనే యువకుడు రెండు రోజుల నుంచి కనిపించకుండా పోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ మంగళవారం తెలిపారు. రాజశేఖర్ రెడ్డి ఎల్లారెడ్డి ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఈ నెల 17న ఉదయం కళాశాలకు వెళ్లిన అతడు ఇంటికి తిరిగిరాలేదు. అతడి తండ్రి హన్మంత్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

దోమకొండలో తల్లీ కూతురు..

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన నర్రాగుల కళావతి ఆమె కూతురు భవానీ అదృశ్యమైనట్లు దోమకొండ ఎస్సై స్రవంతి మంగళవారం తెలిపారు. కళావతి సోమవారం భర్త నరసింహులుతో గొడవపడింది. అనంతరం కూతురు భవానీని తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా వారి ఆచూకీ లభించలేదు. దీంతో కళావతి పెద్ద కూతురు నికిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


గంజాయి రవాణా చేస్తున్న ముఠా అరెస్ట్

- 445 గ్రాముల గంజాయి స్వాధీనం



కామారెడ్డి క్రైం: గంజాయి రవాణా చేస్తున్న ఓ ముఠాను కామారెడ్డి రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 445 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ రామన్ వివరాలు వెల్లడించారు. గంజాయి రవాణాపై విశ్వసనీయ సమాచారం రావడంతో దేవునిపల్లి ఎస్సై రాజు ఆధ్వర్యంలో రామారెడ్డి బ్రిడ్జి వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఓ కారు, బైక్‌లపై గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని నిజామాబాద్‌కు చెందిన రాథోడ్ రవి, సయ్యద్ సాజిద్, కామారెడ్డికి చెందిన దేవుని పృథ్వీ, నిట్టూరి సిద్ధార్థరావు, పసులోటి భానుచందర్‌గా గుర్తించారు. గంజాయిని, వాహనాలను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

నగరంలో పోలీసు కవాతు



ఖలీల్‌వాడి: నగరంలోని రెండో పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్స్ మంగళవారం కవాతు నిర్వహించారు. రానున్న రంజాన్, హనుమాన్ జయంతి వేడుకల నేపథ్యంలో స్టేషన్ పరిధిలోని గోల్‌హనుమాన్ నుంచి కసాబ్‌గల్లీ, గాజులపేట్ తోపాటు హైమద్‌బజార్, నెహ్రూపార్క్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, టౌన్ సీఐ శ్రీనివాసురాజు, ఎస్సై యాసీన్‌ఆరాఫత్ తదితరులు పాల్గొన్నారు.